

కొత్త డిజైన్‌తో ఫ్లోటింగ్ బ్రిడ్జి

- హై డెన్సిటీ బ్లాకులతో నిర్మాణం
- ముంబై నుంచి నిపుణల రాక



.... వార్త 7వ పేజీలో

టికెట్ టెన్షన్!

నేడు టీడీపీ మలి జాబితా విడుదల

- ఆశావహుల్లో ఉత్కంఠ
- చోడవరం టికెట్ రేస్‌లో కేఎస్ఎన్ఎస్ రాజు, తాతయ్యబాబు, మల్లునాయుడు
- మాడుగుల రేసులో పీవీజీ కుమార్, గవిరెడ్డి, పైలా
- అధిష్ఠానం పరిశీలనలో మాజీ మంత్రి బండారు



బి.తాతయ్యబాబు



కేఎస్ఎన్ఎస్ రాజు



జి.మల్లునాయుడు



- జనసేన తరపున పెందుర్తి నుంచి పంచకర్ల, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్
- బీజేపీకి అనకాపల్లి ఎంపీ స్థానం
- అధిష్ఠానం పరిశీలనలో సీఎం రమేశ్ పేరు

గాజువాకకు పల్లా శ్రీనివాసరావు

- భీమిలిపై ఉత్కంఠ
- రేస్‌లో గంటా శ్రీనివాసరావు, కర్రోతు బంగార్రాజు, కోరాడ రాజబాబు
- విశాఖ పార్లమెంటు స్థానానికి ఎం.శ్రీభరత్ పేరు ఫైనల్

·7లో



బండారు



పీవీజీ కుమార్



గవిరెడ్డి రామానాయుడు



పైలా ప్రసాదరావు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన, బీజేపీల మధ్య పొత్తు కొలిక్కి రావడంతో అభ్యర్థుల ఎంపికపై ఆయా పార్టీల అధినేతలు దృష్టిసారించారు. అనకాపల్లి పార్లమెంటు నియోజక వర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను పొత్తులో భాగంగా టీడీపీ నాలుగు, జనసేన మూడు స్థానాల్లో పోటీ చేయాలని ఇప్పటికే నిర్ణయించాయి. టీడీపీ నర్సీపట్నం, పాయకరావుపేటలకు, జనసేన అనకాపల్లికి అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. చోడవరం, మాడుగులకు టీడీపీ ఎలమంచిలి, పెందుర్తికి జనసేన పార్టీ గురువారం అభ్యర్థులను ప్రకటించే అవకాశం వుందని తెలిసింది. చోడవరం, మాడుగుల టికెట్లను ముగ్గురేసి చొప్పున ఆశిస్తున్నారు. జనసేనకు కేటాయించిన పెందుర్తి నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ బరిలో దిగడం దాదాపు ఖాయమైంది. ఇక బీజేపీకి కేటాయించిన అనకాపల్లి లోక్‌సభ నియోజక వర్గం నుంచి రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పోటీ చేస్తారని తెలిసింది.

తెలుగుదేశం, జనసేన పార్టీలు మలి విడత జాబితాలను, భారతీయ జనతా పార్టీ తొలి జాబితాను గురువారం ప్రకటించనున్నట్టు సమాచారం రావడంతో ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది. నర్సీపట్నం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత, అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణ పేర్లను ఆయా పార్టీల అధినేతలు తొలి విడత జాబితాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక టీడీపీ మరో రెండు (చోడవరం, మాడుగుల) నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. చోడవరం టికెట్ రేసులో నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు ఉన్నారు. పలుమార్లు నిర్వహించిన సర్వేల ఆధారంగా వీరిలో టికెట్ ఎవరికి ఇవ్వాలన్న దానిపై టీడీపీ అధిష్ఠానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. అభ్యర్థి ... మిగతా 8వ పేజీలో

బీజేపీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్?



సీఎం రమేశ్

మూడు పార్టీల పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీటును బీజేపీకి కేటాయించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్టు తెలిసింది. తొలుత టీడీపీ, జనసేన పొత్తుల నేపథ్యంలో అనకాపల్లి ఎంపీ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తారని, పవన్‌కల్యాణ్ సోదరుడు నాగబాబు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కూటమిలో బీజేపీ కూడా చేరడంతో ఇప్పుడు అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. సామాజిక సమీకరణల్లో భాగంగా కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ పేరును అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఆయన అభ్యర్థిత్వాన్ని ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. పారిశ్రామికవేత్త అయిన సీఎం రమేశ్ చాలా కాలంపాటు తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. 2012లో టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2018లో రెండోసారి కూడా టీడీపీ అవకాశం కల్పించింది. గత సాధారణ ఎన్నికల తరువాత ఆయన బీజేపీలో చేరారు. రాజ్యసభ పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తుండడంతో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. అయితే అనకాపల్లి నుంచి సీఎం రమేశ్‌తోపాటు బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మహిళా మోర్చ నాయకురాలు తోట విజయలక్ష్మి పేర్లను కూడా పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

వైసీపీ విందు రాజకీయాలు!



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో అధికార పార్టీ నేతల్లో గుబులు

- జనాన్ని ఆకట్టుకోవడానికి వలంటీర్ల సాయం
- సమావేశాల పేరుతో విందు భోజనాలు ఏర్పాటు
- నగదుతోపాటు బహుమతులు పంపిణీ
- ఓ అమాత్యుని నియోజకవర్గంలో 'వలంటీర్లకు వందనం' పేరుతో సభలు
- పరోక్షంగా ఎన్నికల ప్రచారం
- ద్వితీయ శ్రేణి నేతల ద్వారా డబ్బులు అందజేత
- వివిధ సామాజికవర్గాల నేతలతో ఆత్మీయ సమావేశాలు
- వచ్చే ఎన్నికల్లో 'సహకారం' అందించాలని వినతి



కె.కోటపాడు ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం అధికార పార్టీ నేత ఏర్పాటు చేసిన విందు భోజనాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాలో అధికార వైసీపీ నాయకులు విందు రాజకీయాలకు తెరలేపారు. కొద్ది రోజులుగా అన్ని నియోజకవర్గాల్లో క్యాడర్‌తో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ, భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. కొంతమందికి చీరలు, కుక్కర్లు వంటివి అందజేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ ఎన్‌డీఏలో చేరడం, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడిగా పోటీ చేస్తుండడంతో వైసీపీ నేతలు గుబులు చెందుతున్నారు. సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం ఎన్ని పథకాలు అమలు చేసినప్పటికీ, ప్రభుత్వం తమకు ఇచ్చినదానికంటే, తమ నుంచి ప్రభుత్వం వివిధ రూపాల్లో తీసుకున్నదే ఎక్కువని ప్రజలు భావిస్తున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఎదురుగాలి తప్పదనే భయంతో ఓటర్లను ఆకట్టుకోవడానికి వైసీపీ నాయకులు పలు రకాల ఎరలు వేస్తున్నారు. ఎన్ని పార్టీలు పొత్తు పెట్టుకున్నప్పటికీ తమ పార్టీ మాత్రం సింగిల్‌గానే పోటీ చేస్తుందని అధికార పార్టీ నేతలు డాంబికాలు పోతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతను చూసి వణికిపోతున్నారు. తాము నియమించుకున్న వలంటీర్ల ద్వారా ఓటర్లను ఆకట్టుకునే చర్యలకు దిగారు. అభినందన సభల పేరుతో వలంటీర్లకు నగదుతోపాటు వస్తువులను అందజేస్తున్నారు. గ్రామాల్లో కుల సంఘాల నేతలతో రాత్రిపూట సమావేశాలు నిర్వహించి, వచ్చే ఎన్నికల్లో 'సహకారం' అందించాలని కోరుతున్నారు. కాగా జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఒకరు.. వలంటీర్లను తన ఫామ్‌హౌస్‌కు రప్పించుకుని విందు భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం ఒక్కో వలంటీరుకు రూ.10 వేల చొప్పున నగదు ముట్టజెప్పినట్టు తెలిసింది. మరో సీనియర్ ఎమ్మెల్యే తన నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో 'వలంటీర్లకు వందనం' పేరుతో కార్యక్రమాలను ఏర్పాటు చేసి పరోక్షంగా ఎన్నికల ప్రచారం సభలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమం ముగిసిన తరువాత విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. వలంటీర్లకు తాను నేరుగా డబ్బులు ఇవ్వకుండా, మండలస్థాయి నాయకుల డబ్బు పంపించి వలంటీర్లకు, సచివాలయాల సిబ్బందికి అందించే ఏర్పాట్లు చేస్తున్నారని తెలిసింది. ఇప్పటికే రెండు మండలాల్లో ఈ తరహా సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపు మిగిలిన రెండు మండలాల్లో కూడా 'వలంటీర్లకు వందనం' సభలు ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. జిల్లాకు చెందిన మరొక ఎమ్మెల్యే ప్రత్యక్షంగా రంగంలోకి దిగకుండా.. మీకు నచ్చినచోట పార్టీ ఏర్పాటు చేసుకొని, ఎన్నికల్లో సహకరించాలంటూ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి నగదు, బహుమతులు అందజేసినట్టు తెలిసింది. జీవీఎంసీ పరిధిలో అనకాపల్లి జిల్లాలో వున్న ఒక నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఓ నాయకుడు గ్రామీణ ప్రాంతంలో తన సామాజిక వర్గ ప్రతినిధులతో ఆత్మీయ సమావేశాలు జరుపుతున్నారు.

అక్రమ నిర్మాణానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్!

ప్రభుత్వ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన సిటీ క్లబ్ నిర్వాహకులు

- టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు నిల్
- అక్రమార్కులకు అధికార యంత్రాంగం అండదండలు





సిటీ క్లబ్ ఆవరణలో అనుమతులు లేకుండా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్. (ఇన్‌సెట్‌లో) షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేశ్, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు

నర్సీపట్నం, మార్చి 13:

ప్రభుత్వ స్థలంలో మునిసిపాలిటీ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన సిటీ క్లబ్ దుకాణాల సముదాయానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ ప్రారంభోత్సవం చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేతోపాటు మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, వైసీపీ కౌన్సిలర్లు పాల్గొనడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

నర్సీపట్నం నడిబొడ్డులో మెయిన్ రోడ్డును ఆనుకొని, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సర్వే నంబరు 357/3లో 55 సెంట్లు గ్రామ కంఠం స్థలంలో సిటీ క్లబ్ నడుపుతున్నారు. పూర్వం గ్రామ పెద్దలు, అధికారులు టెన్నిస్, షటిల్ వంటి ఆటలు ఆడుకోవడానికి రిక్రియేషన్ క్లబ్ కోసం 55 సెంట్లు స్థలాన్ని వాడుకునే వారు. దీనికి ప్రభుత్వం ... మిగతా 8వ పేజీలో

ఫ్లైయాష్ రవాణాతో తంటాలు

రోడ్డుపై జారి పడుతున్న బూడిద కుప్పలు

- గాలిలోకి ఎగిసి.. వాహనదారుల కళ్లల్లో పడుతున్న దుమ్ము, ధూళి
- ఇళ్లల్లో పేరుకుపోతున్న బూడిద
- ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఫ్లైయాష్ లారీలను అడ్డుకున్న పైడివాడ అగ్రహారం గ్రామస్థులు
- గంటకుపైగా వాహనాలు నిలుపుదల
- ఆందోళనకారులతో ఎస్ఐ చర్చలు
- సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ



ఫ్లైయాష్ లారీలను అడ్డుకొన్న గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ ధనుంజయ్

సబ్బవరం, మార్చి 13:

ఫ్లైయాష్‌ను రవాణా చేస్తున్న లారీలు, టిప్పర్ల యజమానులు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సర్పంచ్ వడ్డాది అప్పలరాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, యువకులు, మహిళలు కలిసి ఫ్లైయాష్ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆందోళకారులు మాట్లాడుతూ, విశాఖ- రాయ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా సబ్బవరంతోపాటు విజయనగరం జిల్లా కొత్తవలస, జామి, గంట్యాడ మండలాల్లో జరుగుతున్న పనుల కోసం సింహాద్రి ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్‌ను లారీలు, టిప్పర్లలో తరలిస్తున్నారని చెప్పారు. ఈ వాహనాలు లంకెలపాలెం జంక్షన్ నుంచి నంగినారపాడు, పెదముషిడివాడ, పైడివాడ అగ్రహారం, అసకపల్లి మీదుగా వెళుతున్నాయని పేర్కొన్నారు. లంకెలపాలెం- అసకపల్లి రోడ్డు ఇప్పటికే అధ్వానంగా వుందని, ఫ్లైయాస్‌తో గంటలకు పదికిపైగా లారీలు వెళుతుండడంతో మరింత దారుణంగా తయారవుతున్నదని వాపోయారు. అంతేకాక ఫ్లైయాష్ రవాణా చేసేటప్పుడు కనీసం జాగ్రత్తలు పాటించడంలేదని, వాహనాల నుంచి రోడ్డుపై ముద్దలు ముద్దలుగా బూడిద పడుతుందని చెప్పారు. దీనిని తొలగించకపోవడంతో గాలిలోకి ఎగిరి ఇళ్లల్లోకి వస్తున్నదని, ఈ మార్గంలో వెళ్లే వాహనదారుల కళ్లల్లో పడుతున్నదని తెలిపారు. ఈ సమస్యలను జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ దృష్టికి తీసుకెళ్లగా. రోడ్డుపై ట్యాంకర్‌తో నీటిని చల్లుతున్నారని, దీని వల్ల రోడ్డు మొత్తం బురదగా మారి ద్విచక్రవాహనదారులు జారిపడుతున్నారని ... మిగతా 8వ పేజీలో



బూడిదపై నీరు చల్లడంతో బురదమయమైన రోడ్డు



పైడివాడఅగ్రహారం వద్ద లారీల నుంచి జారపడిన ఫ్లైయాష్

గోవాడలో క్రషింగ్ సమాప్తం

లక్షా 70 వేల 601 టన్నుల చెరకు గానుగ

- లక్ష్యానికి దూరంగా క్రషింగ్
- సుమారు 8.55 శాతం రికవరీ

చోడవరం, మార్చి 13:



గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో 2023-24 క్రషింగ్ సీజన్ బుధవారం తెల్లవారుజామున ముగిసింది. వాస్తవంగా ఈ నెల 5వ తేదీతో క్రషింగ్ ముగించనున్నట్టు ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రకటించింది. కానీ కాటాల నుంచి చెరకు వస్తుండడంతో మరికొద్ది రోజులపాటు క్రషింగ్ కొనసాగించారు. ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు బుధవారం ఉదయం పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టిన అనంతరం క్రషింగ్ సీజన్ ముగిసినట్టు ప్రకటించారు. ప్రస్తుత సీజన్‌లో లక్షా 70 వేల 601 టన్నుల చెరకును క్రషింగ్ చేశారు. సుమారు 8.55 శాతం రికవరీతో లక్షా 44 వేల క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి అయింది. మరో రెండు వేల క్వింటాళ్ల వరకూ పంచదార దిగుబడి వస్తుంది. వాస్తవంగా 2023-24 సీజన్‌లో రెండు లక్షల టన్నుల పైబడి చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఫ్యాక్టరీ పరిధిలో చెరకు సాగు తగ్గిపోవడం, కొంతమంది రైతులు పక్క జిల్లాకు చెందిన ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీకి చెరకు విక్రయించడం వంటి కారణాల వల్ల లక్ష్యం మేరకు క్రషింగ్ చేయలేకపోయామని ఫ్యాక్టరీ అధికారులు చెబుతున్నారు. కాగా కో-జనరేషన్ ప్లాంట్ ద్వారా 18 లక్షల 52 వేల యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు. ఈ ఏడాది ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ సజావుగా సాగేందుకు సహకరించిన రైతులకు, కార్మికులకు ఎండీ వి.సన్యాసినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.10
సహరి (శుక్ర)	4.52

జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌కు లక్ష్మీపురం హైస్కూల్ ప్రాజెక్టు ఎంపిక

చోడవరం, మార్చి 13:

జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్ (ఇన్‌స్పైర్ మనాక్) పోటీలకు అనకాపల్లి జిల్లా నుంచి ఒకే ఒక్క పాఠశాల ఎంపికైంది. చోడవరం మండలం లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైనట్టు జిల్లా సైన్స్ అధికారి దాడి కాళిదాస్ బుధవారం తెలిపారు. చిత్తూరు జిల్లా పలమనేరులో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు 306 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో 24 ప్రాజెక్టులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయని ఆయన తెలిపారు. అనకాపల్లి జిల్లా నుంచి లక్ష్మీపురం విద్యార్థినులు గుణశ్రీ, కీర్తిలు ప్రదర్శించిన 'ఇన్నోవేషన్ సొల్యూషన్స్ ఆఫ్ ఆనియన్ క్రైసిస్ ఇన్ ఇండియా' అనే ప్రాజెక్టు మాత్రమే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థినులను, వారికి మార్గదర్శనం చేసిన ఉపాధ్యాయులను, హెచ్‌ఎంను జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ అభినందించారని కాళిదాస్ తెలిపారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టుతో లక్ష్మీపురం విద్యార్థినులు గుణశ్రీ, కీర్తి

క్రైం... crime news

బాలికలపై అత్యాచారం కేసులో
ముద్దాయికి యావజ్జీవ కారాగారం

విశాఖపట్నం/నాతవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాలికలపై అత్యాచారం కేసులో నేరం రుజువుకావడంతో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.12 వేల రూపాయలు జరిమానా విధిస్తూ బుధవారం విశాఖ పోక్సో కోర్టు తీర్పు చెప్పింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నాతవరం గ్రామానికి చెందిన యర్రా సూరిబాబు అలియాస్ గూని సూరిబాబు (48)...2013 ఫిబ్రవరి ఆరో తేదీన చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపించి ముగ్గురు బాలికలను మేడపైకి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ముగ్గురిలో ఒక బాలిక జరిగిన విషయాన్ని తల్లికి చెప్పింది. ఈ మేరకు సదరు బాలిక తండ్రి నాతవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు చిన్నారులను విచారించి కోర్టుకు ఆధారాలను సమర్పించారు. దీంతో నిందితుడికి పోక్సో కోర్టు కఠిన శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. కేసులో నేర నిరూపణకు ప్రాథమిక, భౌతిక, సాంకేతిక ఆధారాలను సేకరించి కోర్టుకు సమర్పించినట్టు పోలీసులు తెలిపారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేసినట్టు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా ఎస్‌ఐ పి.రమేష్, వాదనలు వినిపించిన అడిషనల్ పీపీ కరణం కృష్ణ, సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు, మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

సెజ్ సింబయో కంపెనీలో ప్రమాదం

» ముగ్గురు కార్మికులకు గాయాలు

రాంబిల్లి, మార్చి 13: ఎస్‌ఈజడ్‌లోని సింబయో జనరిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. స్థానిక పోలీసులు, కంపెనీ కార్మికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉదయం పదిన్నర గంటల సమయంలో కంపెనీలోని పలువురు కార్మికులు బాయిలర్ శుభ్రం చేసే క్రమంలో అందులోని వేడి నీటితో కూడిన ఆవిరి కార్మికులపై తూలింది. ఈ సంఘటనలో రాంబిల్లి మండలానికి చెందిన కె.సన్యాసిరావు, కె.నర్సింగరావు, చోడవరం మండలానికి చెందిన ఏ.రాములు గాయపడ్డారని తోటి కార్మికులు తెలిపారు. గాయపడిన వీరిని కంపెనీ యాజమాన్యం చికిత్స నిమిత్తం విశాఖలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్టు వారు తెలిపారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, రాంబిల్లి సర్కిల్ సీఐ లక్ష్మణరావు, అచ్యుతాపురం సీఐ బచ్చిరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను కంపెనీ ప్రతినిధులు, కార్మికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రాంబిల్లి సర్కిల్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. సింబయో కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, మండల కన్వీనర్ చందక రామకృష్ణ డిమాండ్ చేశారు.

మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

అనకాపల్లి టౌన్, మార్చి 13: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద 15 మద్యం బాటిళ్లతో వెళుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని మద్యం దుకాణం నుంచి మద్యం కొనుగోలు చేసి సత్తెమ్మతల్లి ముఖద్వారం వైపు వెళుతున్న మునగపాక ప్రాంతానికి చెందిన వి. పూర్ణచంద్రరావును పట్టణ పోలీసులు తనిఖీ చేశారన్నారు. అతని సంచిలో 15 మద్యం బాటిళ్లు ఉన్నట్టు గుర్తించారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామని హెచ్‌సీ తెలిపారు.

గాజువాకకు పల్లా శ్రీనివాసరావు

» భీమిలిపై ఉత్కంఠ... రేస్‌లో గంటా, కర్రోతు, కోరాడ
» విశాఖ పార్లమెంటు స్థానానికి ఎం.శ్రీభరత్ పేరు ఫైనల్
» జనసేనకు 'సౌత్', పెందుర్తి.. బీజేపీకి 'నార్త్'

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు (ఆరు పూర్తిగా, మరొకటి పాక్షికంగా) ఉండగా...తెలుగుదేశం పార్టీ నాలుగు (భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, గాజువాక), జనసేన రెండు (విశాఖపట్నం సౌత్, పెందుర్తి), బీజేపీ ఒక (విశాఖపట్నం నార్త్) చోట పోటీ చేయనున్నాయి. ఆ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి జాబితాలో విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సిట్టింగ్ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబుల పేర్లు ప్రకటించారు. జిల్లాలో మిగిలిన గాజువాక, భీమిలి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు గురువారం ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. గాజువాక సీటు పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు దాదాపు ఖరారైంది. కాగా భీమిలి విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. భీమిలి సీటును మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుతో పాటు, నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆశిస్తున్నారు. అయితే గంటాను విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబునాయుడు సూచించారు. ఈ నేపథ్యంలో తన వియ్యంకుడు పి.నారాయణతో కలిసి గంటా బుధవారం ఉదయం చంద్రబాబునాయుడును కలిశారు. దీంతో భీమిలి నుంచి ఎవరు బరిలో దిగుతారోనన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. 'సౌత్' సీటును జనసేనకు కేటాయించిన నేపథ్యంలో తగిన న్యాయం చేస్తామని అక్కడ ఇన్‌చార్జి గండి బాబ్జీకి అధినేత భరోసా ఇచ్చారు.

ఇక జనసేనకు కేటాయించిన విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి చెల్లుబోయిన వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌బాబు, బీజేపీకి ఇచ్చిన విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్లు దాదాపు ఖరారైనట్టు చెబుతున్నారు.

పార్లమెంటు బరిలో ఎం.శ్రీభరత్?

విశాఖ లోక్‌సభ స్థానానికి టీడీపీ తరఫున ఎం.శ్రీభరత్ పేరు దాదాపు ఖరారైంది. పొత్తులో భాగంగా బీజేపీ విశాఖ లోక్‌సభ సీటు తమకు కేటాయించాలని కోరింది. అయితే అందుకు చంద్రబాబునాయుడు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో శ్రీభరత్ పేరు ప్రకటన లాంఛనమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గురువారం ప్రకటించే జాబితాలో ఆయన పేరు ఉండే అవకాశం ఉంది.

కొత్త డిజైన్‌తో ఫ్లోటింగ్ బ్రిడ్జి


అలల వంతెన నిర్మాణానికి తెప్పించిన కొత్త బ్లాకులు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామకృష్ణా బీచ్‌లో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి అలల తాకిడిని తట్టుకోలేకపోతుండడంతో దాని డిజైన్‌ను మార్చాలని నిర్ణయించారు. ఇందుకోసం ముంబై నుంచి నిపుణులను రప్పించారు. వారు, వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులు కలిసి కొన్ని కొత్త డిజైన్లు రూపొందించారు. వాటిలో ఒక దానిని ఎంపిక చేసి ఆ ప్రకారం...మళ్లీ పునర్నిర్మిస్తున్నారు. దీనికోసం హై డెన్సిటీ పాలీఎథిలీన్ (హెచ్‌డీపీఈ) బ్లాకులు రప్పించారు. పాత బ్లాకులు ధృడంగా లేవని వీఎంఆర్‌డీఏ కమిషనర్ భావించడంతో దాని కంటే నాణ్యమైనవి తెప్పించారు. అలలు వచ్చేటపుడు వాటి ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం హై డెన్సిటీ పాలీఎథిలీన్ బ్లాకులకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఫ్లోటింగ్ బ్రిడ్జిపై రెండు వైపులా చిన్న చిన్న స్తంభాలతో రెయిలింగ్ ఏర్పాటు చేయగా, మధ్యలో కూడా మరో వరుస స్తంభాలు పెట్టాలని నిర్ణయించారు. కొత్త బ్లాకులతో తయారుచేసిన బ్రిడ్జిని పౌర్ణమి సమయంలో రెండు, మూడు రోజులు పరీక్షించి, పటిష్ఠంగా ఉందని నిర్ధారించుకున్నాకే పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

» మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ


అనకాపల్లి పట్టణ జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి సమావేశంలో ఎన్నికల గుర్తు గాజుగ్లాసు చూపుతున్న అభ్యర్థి కొణతాల రామకృష్ణ, బుద్ద నాగజగదీశ్వరరావు తదితరులు

అనకాపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు అనకాపల్లి సమగ్ర అభివృద్ధికి రానున్న ఎన్నికల్లో అంతా కలిసికట్టుగా పనిచేద్దామని, వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని కూటమి ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన, బీజేపీ పట్టణ విభాగాల నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ మూడు పార్టీల కలయికతో భవిష్యత్తులో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయన్నారు. అందరూ కలిసి పని చేస్తే విజయం సాధించడం పెద్ద పనేమీ కాదన్నారు. ఎన్నికల గుర్తు గాజు గ్లాసును చూపించి దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ పట్టణ విభాగం నాయకులు నాగేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, కొణతాల రాజాబాబు, అలమండ శ్రీనివాసరావు, వర్మ, జనసేన నాయకులు శ్రీరాందాస్ గోవింద, దూలం గోపి, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, బర్నికాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాంకీ తాగునీటి పైపులైన్ పనుల అడ్డగింత

» గ్రీన్‌బెల్టు ఏరియాలో చెట్లు నరికి పనులు చేపట్టడంపై గ్రామస్థుల ఆగ్రహం


పైపులైన్ పనులను పరిశీలిస్తున్న తాడి గ్రామస్థులు

పరవాడ, మార్చి 13: రాంకీ యాజమాన్యం చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులను తాడి గ్రామస్థులు బుధవారం అడ్డుకున్నారు. గ్రీన్ బెల్టు ఏరియాలో గల చెట్లను నరికివేసి పైపులైన్ పనులను చేపట్టడంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తక్షణమే పైపులైన్ పనులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాదం శెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే ఫార్మా కాలుష్యంతో అల్లాడిపోతున్నామని, ఇటువంటి తరుణంలో గ్రీన్‌బెల్టు ఏరియాలో ఉన్న చెట్లను తొలగించి పైపులైన్ పనులు చేపట్టడం దారుణమన్నారు. గ్రామస్థుల ఆందోళనతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అనంతరం గ్రామస్థులు.. డీఆర్‌వో దయానిధిని కలిసి పైపులైన్ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొడ్డపల్లి అప్పారావు, కోమటి అచ్చిబాబు, జుత్తిక మాధవరావు, సూరిఅప్పారావు, పైడిరాజు, నూకరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన అవసరం

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 13: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రక్రియ ముందస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుందన్నారు. అప్పటి నుంచి నియమావళి ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు, పార్టీలకు అవగాహన సమావేశాలు ఉంటాయని చెప్పారు. శాసనసభకు పోటీ చేసేవారు రూ. 10 వేలు, లోక్‌సభకు పోటీ చేసేవారు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యర్థులు 50 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఈ వారంలో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులు, తొలగింపులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి పాటించాల్సిన నియమ నిబంధనలను ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు.

మార్కెట్లో ఉన్న ధరల ఆధారంగానే ఉపయోగించిన వాటి ధరలను నిర్ణయిస్తారన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫెర్టిగేషన్‌తో బహుళ ప్రయోజనాలు

» ఎరువు వినియోగంలో 25 శాతం మేర ఆదా
» పైరు అంతటికీ సమంగా పోషకాలు
» పంట దిగుబడి 30-40 శాతం పెరుగుదల
» జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటలక్ష్మి


క్షేత్రస్థాయిలో ఫెర్టిగేషన్ పద్ధతిలో ఎరువుల వినియోగంపై శిక్షణ ఇస్తున్న డీఎంఐఏ వెంకటలక్ష్మి

బుచ్చెయ్యపేట, మార్చి 13: ఫెర్టిగేషన్ విధానం ద్వారా పంటలకు రసాయన ఎరువులను అందిస్తే వృథాను అరికట్టవచ్చని, అంతేకాక పైరు మొత్తానికి సమంగా ఎరువు అందుతుందని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి (డీఎంఐఏ) జి.వెంకటలక్ష్మి చెప్పారు. ఆమె బుధవారం మండలంలోని లోపూడిలో డ్రిప్ ద్వారా ఫెర్టిగేషన్ విధానంలో ఎరువుల వినియోగంపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మాట్లాడుతూ, నీటిలో కరిగిన ఎరువులను నేరుగా మొక్కల మొదళ్ల వద్ద అందించడం ద్వారా వృథాను అరికట్టవచ్చునన్నారు. దీని వల్ల ఎరువుల ఖర్చు, వినియోగం 25 శాతం తగ్గుతుందని, పంట దిగుబడి 30 నుంచి 40 శాతం పెరుగుతుందని చెప్పారు. ఫెర్టిగేషన్ పరికరాలు లేని పొలాల్లో పంటలకు ఎరువులను నేరుగా వేస్తుంటారని, భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే ముందే వేస్తారని, నత్రజని ఎరువును 2-3 దఫాలుగా వేస్తారని చెప్పారు. పైరుకు అవసరమైన ఎరువులను రెండు, మూడు నెలల ముందే వేయడం వల్ల అధిక శాతం ఎరువు వృథా అవుతుందని ఆమె వివరించారు. దీనివల్ల ఎరువుల ఖర్చు పెరుగుతుందని, పొలంలో భూసారం దెబ్బతింటుందని చెప్పారు. అందువల్ల డ్రిప్ యూనిట్‌కు ఫెర్టిగేషన్ పరికరాలను బిగించుకుని పైరుకు ఎరువులు అందించాలని ఆమె సూచించారు. అనంతరంలో పొలాలకు వెళ్లి ఫెర్టిగేషన్ యూనిట్ వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లోపూడి వీఏఏ జెస్సీ, రైతులు సాయం రఘునాథ్, వివేకానంద చౌదరి, వేణు చౌదరి, తమరాన దాసు, సయ్యపురెడ్డి మాధవరావు, గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి గోల్డ్ బాధితులు ప్రదర్శన


ప్రదర్శన నిర్వహిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

అనకాపల్లి టౌన్, మార్చి 13: అగ్రి గోల్డ్ బాధితులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా డిపాజిట్లు తిరిగి చెల్లించాలని అగ్రిగోల్డ్ బాధితులు బుధవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్, మెయిన్‌రోడ్డు, వన్‌వే జంక్షన్, తహసీల్దార్ కార్యాలయం మీదుగా నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అలాగే బైక్ ర్యాలీ కూడా నిర్వహించారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం, అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావులు మాట్లాడుతూ పదేళ్లుగా బాధితులు పోరాటం చేస్తున్నా అగ్రిగోల్డ్ యాజమాన్యానికి గాని, ప్రభుత్వానికి గాని చలనం లేదని విమర్శించారు. తాను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కేసులు, కోర్టులతో సంబంధం లేకుండా బాధితులందరికీ పరిహారం చెల్లిస్తానని, చనిపోయిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం పువ్వుల్లో పెట్టి ఇస్తానని వాగ్దానం చేసి ఐదేళ్లు గడిచినా వైసీపీ ప్రభుత్వం పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మొల్లేటి గోపాలరమణ, జెర్రిపోతుల దుర్గారావు, పొలమరశెట్టి శేషు, మజ్జి చినఅప్పారావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 13: జిల్లాలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1529 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో 332 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు ఉండగా 1197 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ జరిగేలా సుమారు 10 వేల మందిని ఎన్నికల విధులకు నియమించినట్టు ఆయన తెలిపారు.

పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభం


పీఎం సూరజ్ పోర్టల్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన పీఎం నరేంద్ర మోదీ

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 13: పీఎం సూరజ్ పోర్టల్ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించగా, అనకాపల్లి కలెక్టరేట్ నుంచి అధికారులు, లబ్ధిదారులు బుధవారం తిలకించారు. ఈ పోర్టల్‌లో వివిధ పథకాలతో పాటు రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని బీసీ కార్పొరేషన్ ఈవో నిర్మల లబ్ధిదారులకు వివరించారు.

అరకు ఎంపీ, గాజువాక , అరకు అసెంబ్లీ స్థానాల్లో సీపీఎం పోటీ


వైజాగ్ మేనిఫెస్టో విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విశాఖపట్నం, మార్చి 13: ఉమ్మడి విశాఖ జిల్లాలో అరకు పార్లమెంట్, అరకు, గాజువాక అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీ పోటీచేయనున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం తెలిపారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన పార్టీ విశాఖ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అటవీ ప్రాంత పరిరక్షణ కోసం అనేక రూపాల్లో తమపార్టీ ఉద్యమిస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్, విశాఖ రైల్వేజోన్ సాధన, పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై తమ పార్టీ కేంద్ర ప్రభుత్వంతో నేరుగా పోరాడుతోందన్నారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బి.పద్మ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, బి.గంగారావు, ఆర్కేఎస్వీ కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి.జగన్, కేఎం శ్రీనివాసరావు, బి.రమణి, సుబ్బారావు, పైడిరాజు, శ్రీనివాసరాజు, రాంబాబు, వెంకటరావు, నరేంద్రకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇరువాడ గెడ్డ వాగుల ఆక్రమణపై విచారణ జరపాలి

» సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యురాలు ప్రభావతి


తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బి.ప్రభావతి, ఉప్పాడ సత్యవతి

సబ్బవరం, మార్చి 13: మండలంలోని ఇరువాడ గ్రామం సర్వే నంబర్లు 103, 106 గెడ్డ స్థలం 3 ఎకరాల ఆక్రమణపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యులు బుధవారం స్థానిక తహసీల్దార్ జె. చలమయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరువాడలో గెడ్డ వాగుల ఆక్రమణలపై రైతులు ఆందోళనకు దిగారని, సమగ్ర దర్యాప్తు చేసి ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

» జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు


మామిడి సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

సబ్బవరం, మార్చి 13: జీడిమామిడి, మామిడి తోటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని అమృతపురంలోని జీడిమామిడి, మామిడి రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన.. సకాలంలో ఎరువుల వాడకం, కొమ్మ కత్తిరింపు, పురుగులు, తెగుళ్లకు గురికాకుండా తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు వివరించారు. తోటలను ఆశించే తేనె మంచు, కాయ తొలుచు పురుగు వల్ల నష్టం, నివారణ చర్యలు విశదీకరించారు. సకాలంలో పురుగుల మందులు పిచికారీ చేస్తే మామిడి, జీడి మామిడిలో తెగుళ్లను నివారించవచ్చునన్నారు. మండల ఉద్యాన శాఖాధికారి కిరణ్మయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ భావన, అమృతఫల బోర్డు డైరెక్టర్ వెన్నల అప్పలనాయుడు, సీఈవో కేఎల్ఎన్ మౌక్తిక, సభ్యులు నాగరాజు, బంగార్రాజు, నారాయణబాబు, అక్కునాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వైపు వైసీపీ నేతల చూపు

» చింతకాయల విజయ్‌ను కలిసిన మాకవరపాలెం నాయకులు
» తెలుగుదేశం పార్టీలో చేరికకు సుముఖం


చింతకాయల విజయ్‌తో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మాకవరపాలెం, మార్చి 13: మండలంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు బుధవారం నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత కాయల విజయ్‌ను కలిశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అందువల్ల ఎన్నికల ముందు టీడీపీలో చేరే వారికి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తగిన ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. వైసీపీ నాయకులు మాట్లాడుతూ, మంచిరోజు చూసుకొని గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి టీడీపీలో చేరతామని చెప్పారు. విజయ్‌ను కలిసిన వారిలో రాచపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు జమిందార్, వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన బీసీ సెల్ మండల అధ్యక్షుడు అడిగర్ల శ్రీను, రామన్నపాలెం మాజీ సర్పంచ్ నక్కిన ప్రకాశ్, తదితరులు వున్నారు. ఈ భేటీలో అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, భీమబోయినపాలెం సర్పంచ్ నందకిశోర్, జోగిపాత్రుడు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించిన వరల్డ్ బ్యాంక్ బృందం


వార్డును పరిశీలిస్తున్న డాక్టర్ సందేశ్

అనకాపల్లి టౌన్, మార్చి 13: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని వరల్డ్ బ్యాంక్ బృందం బుధవారం సందర్శించింది. డాక్టర్ సందేశ్ వైద్యాలయంలోని రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. రోగుల ఫీడ్ బ్యాక్‌ను తెలుసుకున్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, వైద్య బృందం వున్నారు.

ఇంటర్ పరీక్షలకు 12,679 మంది హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 13: జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం ఫిజిక్స్/ ఎకనామిక్స్ పరీక్షలకు 12,679 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్‌బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13,097 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 418 మంది హాజరు కాలేదన్నారు.

అనకాపల్లి
నియోజకవర్గం

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, మార్చి 13 : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం బుధవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎల్ఏటీవో డాక్టర్ ఎంవీఎస్ బాలాజీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి పురవీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. 'ఔను మనం టీబీని అంతం చేయగలం' అనే నినాదంతో దారి పొడువున ప్రజలందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీసీ అయ్యప్పరెడ్డి, యల్లాజీ, పెంటయ్య, పద్మజ, లక్ష్మీతో పాటు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కశింకోట, మార్చి 13 : మండలంలోని తేగాడ ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ మార్తతిలకం తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదివిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈ నెల 31వ తేదీలోగా మీ- సేవలో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

కూండ్రంలో పశువుల పాకలు దగ్ధం

కొత్తూరు, మార్చి 13 : కూండ్రంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల పాకలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన యలమంచిలి రమణ, దేముళ్ళకు చెందిన రెండు పాకలు బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఒక గడ్డి కుప్ప, రెండు పాడి పశువుల పాకలు కాలిపోయాయి. అలాగే రెండు గెదేలు తీవ్రంగా గాయపడ్డాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించినట్లుగా బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చిరుధాన్యాల్లోనే అధిక పోషకాలు

పరవాడ, మార్చి 13 : చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా అధిక పోషకాలతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చునని ఐసీడీఎస్ సబ్బవరం ప్రాజెక్టు సీడీపీవో వి.లలితకుమారి అన్నారు. చిరుధాన్యాలు- పౌష్టికాహారంపై తల్లులకు గొర్లివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. చిరు ధాన్యాలతో పౌష్టికాహారం తయారుచేసే విధానం గురించి వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షకీలా, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే మూడు పార్టీల అజెండా

» వైసీపీ పాలనలో అన్నివర్గాలకు నష్టం » ఇసుక నుంచి మద్యం వరకు అన్నింటా దోపిడీయే » జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో కొణతాల

కశింకోట, మార్చి 13 : రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకే జనసేన, టీడీపీ, బీజేపీలు పొత్తు కుదుర్చుకున్నాయని జనసేన పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం ఇక్కడి నూకాంబిక ఫంక్షన్ హాలు ప్రాంగణంలో జరిగిన ఈ మూడు పార్టీల కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం వ్యాపారం చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆరోపించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. ఇసుక వ్యాపారం మొదలుకొని మద్యం వ్యాపారం వరకు అన్నీ వైసీపీ ప్రభుత్వమే చేపట్టి దోచుకుంటుందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 10 నుంచి 20 వేల దొంగ ఓట్లు తొలగించామని చెప్పారు. కాపులకు ఐదుశాతం రిజర్వేషన్ అమలు చేయాలని గతంలో చంద్రబాబునాయుడు తీర్మానం చేస్తే, దానిని ఈ ప్రభుత్వం తొలగించిందన్నారు. కాపులకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని వాపోయారు. త్వరలోనే స్టీరింగ్ కమిటీలను వేసి ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలు తెలుసుకునే కార్యక్రమం చేపడతామన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు, అనకాపల్లిలో కొణతాల రామకృష్ణను గెలిపించుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునేలా


మూడు పార్టీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ


బుదిరెడ్డి చిన్నాకు జ్ఞాపికను అందజేస్తున్న కొణతాల

ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా పిలుపునిచ్చారు. అంతకు ముందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

అనంతరం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బుదిరెడ్డి చిన్నతో జన్మదిన కేక్‌ను కట్‌చేయించి శాలువాతో సత్కరించారు. చిన్నాకు కొణతాల రామకృష్ణ మెమెంటోను అందజేశారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు కాయల మురళీ, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, వేగి గోపీకృష్ణ, కాంద్రేగుల సతీష్, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, బుదిరెడ్డి మోహన్, వీర మహిళలు రెడ్డి ధనలక్ష్మి, సనివాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి
నియోజకవర్గం

నేడు స్వయంభూవరంలో
దుర్గమాంబ పండగ



పరవాడ, మార్చి 13 : కలపాక పంచాయతీ పరిధి స్వయంభూవరంలో దుర్గమాంబ పండగ గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి.

వైసీపీలో పలువురు చేరిక

సబ్బవరం, మార్చి 13 : మేజర్ పంచాయతీ సబ్బవరం సర్పంచ్, టీడీపీ నాయకుడు దెడ్డం ప్రసాదరావు, మొగలిపురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు గండి రవికుమార్ బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో తాడిపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వైసీపీలో చేరారు. వీరికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి , ఎస్పీ మురళీకృష్ణ నివాళి

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 13 : జ్ఞాన సముపార్జన కొందరికే సొంతం కాదని, కృషి పట్టుదల ఏకాగ్రత ఉంటే ఎవరికైనా సాధ్యమని కవయిత్రి మొల్లమాంబ ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అన్నారు. మొల్ల జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కవితలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో దయానిధి, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, జిల్లా పోలీస్ కార్యాలయంలో మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొల్లమాంబ చివరి శ్వాస వరకు తన రచనలతో సమాజ అభ్యుదయం కోసం పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఎస్బీ డీఎస్పీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


మొల్ల చిత్రపటం వద్ద కలెక్టర్, ఎస్పీ నివాళులు

అక్రమ నిర్మాణానికి ఎమ్మెల్యే రిబ్బన్ కట్టింగ్!

... 5వ పేజీ తరువాయి

పట్టా కాని, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ గాని లేవు. అయితే ఏదో ఒక అధికారిక పత్రం ఉండాలన్న ఉద్దేశంతో 2022 అక్టోబరు 10 తేదీన తహసీల్దార్ నుంచి ఎండార్స్‌మెంట్ తీసుకున్నారు. అయితే క్లబ్ నిర్వాహకులు తొలుత ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారుల అండతో రెండు అంతస్థులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ భవనానికి ఆనుకొని 11 దుకాణాలతో మరో షాపింగ్ కాంప్లెక్స్ కట్టారు. నిబంధనల ప్రకారం గ్రామ కంఠం స్థలాన్ని క్లబ్ అవసరాలకు వినియోగించుకోవాలే తప్ప, వాణిజ్య పరమైన వాటికి వినియోగించకూడదు. అయితే ప్రజాప్రతినిధులు, మునిసిపల్ అధికారుల అండదండలు వుండడంతో దుకాణ సముదాయాలు నిర్మించారు. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం ఈ స్థలం విలువ రూ.40-50 కోట్లు ఉంటుంది. పోసీ క్లబ్ తరపున ప్రజలకు సేవా కార్యక్రమాలు ఏవైనా నిర్వహిస్తారా! అంటే అదీ లేదు. టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వయంగా ప్రజాప్రతినిధులే ప్రారంభిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని పట్టణ పౌరులు ఆరోపిస్తున్నారు. పైగా షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే గణేశ్.. 'సిటీక్లబ్ నిర్వాహకులు షాపులు కట్టి పది మందికి ఉపాధి చూపిస్తున్నారు' అని చెప్పడం మరింత విడ్డూరంగా వుందని జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

79వ వార్డు హౌసింగ్ కాలనీలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

» చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ డిమాండ్

పరవాడ, మార్చి 13 : జీవీఎంసీ 79వ వార్డు పరిధి హౌసింగ్ కాలనీలో కొంత మంది వ్యక్తులు గ్రావెల్ అక్రమ తవ్వకాలను చేపడుతున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అనుమతులు లేకుండా కొంతమంది వ్యక్తులు మాఫియాగా ఏర్పడి రాత్రుళ్ల సమయంలో గ్రావెల్‌ను అక్రమంగా తరలించుకుపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మచ్చా శివకుమార్, కరణం అప్పారావు, జాజుల చిన్నారావు తదిత రులు పాల్గొన్నారు.


గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్, నాయకులు

టికెట్ టెన్షన్!

... 5వ పేజీ తరువాయి

పేరు మలి విడత జాబితాలో ఉంటుందా?, లేదా?...అన్నది మరికొన్ని గంటల్లోనే తెలుసుంది. మాడుగుల టికెట్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు ఆశిస్తున్నారు. వీరిలో ఒకరికి టికెట్ ఇవ్వాలా? లేకపోతే పొత్తులో భాగంగా పెందుర్తి స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో గత ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల టికెట్ ఇవ్వాలా? అనే దానిపై అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇక పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన పెందుర్తి నుంచి పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ పోటీ చేయడం దాదాపు ఖాయమైనట్టు సమాచారం.

తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తెలు

» చూపరులకు కంటతడి పెట్టించిన దృశ్యం

మాడుగుల రూరల్, మార్చి 13: ముగ్గురు కుమార్తెలు తమ కన్న తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకున్నారు. మాడుగుల గ్రామానికి చెందిన లంక కన్నయ్య(60) కలాసీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అయోధ్యకు బస్సులో వెళ్లి తిరిగి వస్తూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సమీపంలో అనారోగ్యానికి గురై మృతిచెందాడు. మృతదేహాన్ని అదే బస్సులో మంగళవారం రాత్రి మాడుగుల తీసుకొచ్చారు. కన్నయ్యకు కుమారులు లేరు. కల్పన, సూర్యకళ, శ్రీపూజ కుమార్తెలు వున్నారు. చిన్న కుమార్తె శ్రీపూజ తండ్రికి తలకొరివి పెట్టింది. మిగిలిన ఇద్దరు కుమార్తెలు కూడా అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఎలమంచిలి
నియోజకవర్గం

నేడు నల్లమారెమ్మ పండగ


పూజలు అందుకున్న నల్లమారెమ్మ

అచ్యుతాపురం, మార్చి 13: మండలంలోని గొర్లె ధర్మవరం గ్రామంలో నల్లమారెమ్మ పండగ గురువారం జరగనున్నది. ఈ సందర్భంగా గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల సరిహద్దుల్లో ఈ ఆలయం ఉండటం వల్ల రెండు మండలాలకు చెందిన భక్తులు ప్రతీ ఏటా అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకోటానికి భారీ సంఖ్యలో వస్తారు. తలనీలాలు కూడా అమ్మవారి ఆలయం వద్ద సమర్పించుకోవటం ఆనవాయితీ. అమ్మవారిని దర్శించుకోటానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ ఛైర్మన్ గొర్లె నూకరాజు తెలిపారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పులిహోర అందిస్తామన్నారు. ఈ సదర్భంగా గురువారం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

తేనెటీగల దాడిలో రిటైర్డ్ టీచర్‌కు గాయాలు

ఎలమంచిలి, మార్చి 13: మండలంలో ములకలాపల్లి సమీపంలోని పంట పొలంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు వి.జానకీరామరాజుపై తేనెటీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో క్షతగాత్రుడ్ని విశాఖ ఆస్పత్రికి తరలించారు. బుధవారం పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు విశాఖలోని ఆస్పత్రిలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దివ్యాంగ విద్యార్థులకు బోధన ఉపకరణాలు

రాంబిల్లి, మార్చి 13: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు బోధన ఉపకరణాలను పంపిణీ చేశారు. ఐటీఎల్ కంపెనీలో పనిచేస్తున్న ఎ.సునీత్ సొంత నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ పరికరాలను హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాల్, మరో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం వి.ధనుంజయ్ విద్యార్థులకు అందజేశారు. అలాగే మధ్యాహ్నం విద్యార్థులకు భోజనాలను ఏర్పాటు చేశారు. దాతలు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా హెచ్ఎంలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్పీలు బుజ్జిబాబు, ఎస్.నాగరత్నం తదితరులు ఉన్నారు.

సమస్యలపై పాలకవర్గ సభ్యుల ధ్వజం

ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, మార్చి 13: పట్టణంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలపై పాలక వర్గసభ్యులు ధ్వజమెత్తారు. మునిసిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ అర్రెప గుప్తా మాట్లాడుతూ మునిసిపాలిటీలోని రంగావారి వీధి, ఓరుగంటివారి వీధి వంటి ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. వర్షాల సమయంలో రోడ్లపై చేపలు పట్టుకునేలా నీరు నిలిచిపోతుందన్నారు. పలు చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయని, వీటిని సత్వరమే మరమ్మతులు చేయించాలని చెప్పారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నెలకొన్న లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని రెండేళ్లుగా విద్యుత్ అధికారులకు తెలియపరుస్తున్నా పరిష్కారానికి నోచుకోలేదని కౌన్సిలర్ మరిణేశ్వరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి గత 10 కౌన్సిల్ సమావేశాలు నుంచి చెబుతున్నా సరే ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. మునిసిపాలిటీలో వారపు సంత, రోజువారీ సంతల గెజిట్ అధికారికంగా వేలం పాటదారులు వ్యాపారులు, రైతులు నుంచి వసూలు చేయాల్సిన వివరాలను మార్కెట్లో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఈ విషయంపై చర్చించకుండా ఛైర్‌పర్సన్ ఎన్నికలకు వెల్లుతున్నామని దాట వేశారు. కొత్తపాలెం కౌన్సిలర్ రాపేటి సంతోష్ మాట్లాడుతూ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ ముందుంచారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ రమాకుమారి స్పందిస్తూ మునిసిపాలిటీలో పారిశుధ్య సమస్య గతంలో కంటే దారుణంగా తయారైందని చెప్పారు. దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సిబ్బంది విషయంలో పర్యవేక్షణ కొరవడిందని పలువురు కౌన్సిలర్లు అన్నారు. ఇంటి పన్నులు వసూల విషయంలో పలు చోట్ల కొన్ని అసెస్మెంట్ నంబర్లు డబుల్‌గా నమోదయ్యాయని, వీటిని నిబంధనలు ప్రకారం నిర్ధారణ చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ కొండలరావు, డీఈ వీరయ్య, ఆర్వో నీలిమ, వైస్ ఛైర్మన్ గుప్తా, అధికారులు పాల్గొన్నారు.


మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారుల... మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ రమాకుమారి

పరిహారానికి మత్స్యకారుల ఆందోళన

అచ్యుతాపురం, మార్చి 13: సాగు భూములకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మత్స్యకార మహిళలు బుధవారం ఆందోళనకు దిగారు. తమ భూమిలోనే టెంట్ వేసి ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. పూడిమడక శివారులోని సర్వే నంబరు 134/2, 135లలో సుమారు ఏడెకరాల ప్రభుత్వ భూమిని సుమారు 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఈ భూమిలో జీడిమామిడి, మామిడి మొక్కలు వేసుకుని జీవనోపాధి పొందుతున్నామని వారు తెలిపారు. అయితే హార్బర్ రోడ్డు కోసం సాగుదారులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా చెట్లను నేలకూల్చేయడం దారుణమని అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పేర్ల మంగ, అంగ కామేశ్వరి, పేర్ల బాపనమ్మ, చేపల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ఏటికొప్పాక కళాకారులకు టూల్ కిట్లు

ఎలమంచిలి, మార్చి 13: ఏటికొప్పాకలో హస్త కళాకారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన టూల్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. డెవలప్‌మెంట్ హెండీక్రాఫ్ట్ 147 టూల్ కిట్లను హస్తకళాకారుల సొసైటీ భవనంలో అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శానాపతి రాము, దిమిలి రమణబాబు తదితరులు పాల్గొన్నారు

స్టీల్‌ప్లాంట్ సమావేశానికి తరలిరండి

» కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అనంతరావు

అచ్యుతాపురం, మార్చి 13: స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 15న జరిగే సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలిరవాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు తనకాల అనంతరావు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులతో పాటు కమ్యూనిస్ట్ నాయకులు పాల్గొంటారన్నారు. సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పాయకరావుపేట
నియోజకవర్గం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

కంటి సమస్యలు రాకుండా చూసుకోండి

పాయకరావుపేట, మార్చి 13: ఎంతో ప్రధానమైన కండ్లకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని ప్రముఖ కంటి వైద్య నిపుణులు (గ్లకోమ సైంటిస్టు, అరవింద్ ఐ ఇన్స్టిట్యూట్, మధురై) డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా స్థానిక హైమా నేత్రాలయంలో బుధవారం నిర్వహించిన సదస్సులో గ్లకోమాపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. గ్లకోమ అనేది వ్యాధి కంటి లోపల పీడనం పెరిగి కంటి నరాన్ని చచ్చుబడిపోయేలా చేస్తుందన్నారు. అలాగే నెమ్మదిగా కంటి చూపు తగ్గిపోతుందన్నారు. గ్లకోమ ప్రాథమిక దశలో తరచూ తలనొప్పి, కంటి ఎరుపు, వాంతులు, కనుగుడ్డు నొప్పి కలిగి ఉంటుందని వంటి సమస్యలు వస్తాయన్నారు. వెంటనే నేత్ర వైద్యుడిని సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హైమా నేత్రాలయం అధినేత డాక్టర్ శివరాజాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

1800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

పాయకరావుపేట, మార్చి 13: పట్టణ శివార్లలో బుధవారం నాటుసారా తయారీ కోసం సిద్ధం చేసిన 1800 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. పట్టణ శివారులోని తాండవ నది వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నాటుసారా తయారీ కోసం పులుపును తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో సాయంత్రం దాడులు చేశామన్నారు. నిందితులు పారిపోగా, సారా తయారీకి ఉంచిన 1800 లీటర్ల పులుసును ధ్వంసం చేశామని ఆయన తెలిపారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

ఎస్.రాయవరం, మార్చి 13: కొరుప్రోలు గ్రామంలో ప్రమాదాల నివారణపై బుధవారం ఎస్ఐ విభీషణరావు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో వ్యవహరించాల్సిన తీరుతో పాటు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అక్కడ ప్రజలకు అవగాహన ఎస్ఐ పలు సూచనలు చేశారు.

ఫ్లైయాష్ రవాణాతో తంటాలు

... 5వ పేజీ తరువాయి

వాపోయారు. తమ ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోరా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లైయాష్ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. కాగా పైడివాడ అగ్రహారంలో ఫ్లైయాష్ వాహనాలను స్థానికులు అడ్డుకున్నట్టు తెలుసుకున్న ఎస్ఐ ధనుంజయ్, సిబ్బందితో అక్కడకు వెళ్లారు. ఆందోళనకారులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. రోడ్డు నిర్మాణ కంపెనీ ప్రతినిధులు, ఫ్లైయాష్ రవాణా చేసే వాహనాల యజమానులతో పైడివాడ అగ్రహారంలో సమావేశం ఏర్పాటు చేయిస్తానని, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్ఐ హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించి ఫ్లైయాస్ లారీలను విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, అక్కిరెడ్డి దుర్గినాయుడు, గొంతిన పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో పోలీసుల ముమ్మర తనిఖీలు

కోటవురట్ల, మార్చి 13: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ముందు నుంచే కోటవురట్ల పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలతో పాటు ప్రయాణికుల లగేజీలకు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాయకరావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలకు అనుసంధానమైన రేవుపోలవరం ఆర్అండ్‌బీ రోడ్డులోని కోటవురట్ల పాతరోడ్డు, లింగాపురం జంక్షన్‌లో ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో పోలీసులు నిఘా పెంచారు. ఎన్నికల కోడ్‌కు ముందే అభ్యర్థుల ఎంపిక పూర్తికావడంతో ముందస్తుగా తాయిలాల పంపిణీ కోసం నగదు రవాణా జరుగుతుందనే అనుమానంతో తనిఖీలను ముమ్మరం చేశారు. ఏ వాహనంలోనూ నగదును రవాణా జరగకుండా తగిన చర్యలు చేపడుతున్నారు. వాహనాల్లో రూ.50 వేలు కంటే ఎక్కువ నగదును ఆధారాలు లేకుండా వెంట తీసుకు పోతే పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. వాహన దారులు, ప్రయాణికులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా ఎస్ఐ కోరారు.


కోటవురట్లతో ప్రధాన రహదారిలో పోలీసు తనిఖీలు

జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

▸▸ మాట తప్పడం- మడమ తిప్పడం అతని నైజం ▸▸ యువతకు, ఉద్యోగులకు, మహిళలకు ఎన్నికల ముందు తప్పుడు హామీలు

▸▸ అన్ని రంగాల్లో నష్టపోయిన రాష్ట్రానికి చంద్రబాబు సేవలు అవసరం ▸▸ ధర్మసాగరం ఎన్నికల శంఖారావం సభలో అయ్యన్న


శంఖారావం సభలో మాట్లాడుతున్న అయ్యన్న, చిత్రంలో జడ్పీటీసీ రమణమ్మ తదితరులు

నర్సీపట్నం అర్బన్, మార్చి 13 : ప్రజలను అన్నిరంగాల్లో మోసగించిన సీఎం జగన్‌కు ఈ ఎన్నికల్లో ఓట్లు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మసాగరంలో బుధవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. ఎన్నికల ముందు వైసీపీ అధికారంలోకి వస్తే ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, పోస్టులను భర్తీచేస్తామని జగన్ హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. వైసీపీకి చెందిన మెజార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన ఈ పెద్దమనిషి, కేంద్రం కాళ్ల వద్ద మోకరిల్లుతున్నారన్నారు. ఎన్నికల ముందు అమరావతే రాజధాని అని చెప్పిన జగన్‌రెడ్డి, మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి, రాజధాని లేని రాష్ట్రంగా చేశారని విమర్శించారు. అలాగే ఉద్యోగులకు సీపీఎస్ విషయంలోనూ మాట తప్పారని ఆరోపించారు. 45 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని అయ్యన్న ప్రశ్నించారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంత మందికి అమ్మఒడి ఇస్తానని చెప్పి మాటతప్పారని ఆరోపించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని వాపోయారు. ఈ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలన్నా, ప్రజల కష్టాలు తీరాలన్నా చంద్రబాబు వంటి సమర్థ నాయకత్వం అవసరమన్నారు. ప్రజలంతా త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీటీసీ సుకల రమణమ్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత

▸▸ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

మాడుగుల రూరల్, మార్చి 13 : విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. బుధవారం ఇక్కడి ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతులు, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారికి ఆయన దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించే వారికి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కాశీప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్, ఎస్టీ సెల్ నాయకులు, పలు అధికారులు పాల్గొన్నారు.

తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తెలు

మాడుగుల రూరల్, మార్చి 13: ముగ్గురు కుమార్తెలు తమ కన్న తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకున్నారు. మాడుగుల గ్రామానికి చెందిన లంక కన్నయ్య(60) కలాసీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అయోధ్యకు బస్సులో వెళ్లి తిరిగి వస్తూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సమీపంలో అనారోగ్యానికి గురై మృతిచెందాడు. మృతదేహాన్ని అదే బస్సులో మంగళవారం రాత్రి మాడుగుల తీసుకొచ్చారు. కన్నయ్యకు కుమారులు లేరు. కల్పన, సూర్యకళ, శ్రీపూజ కుమార్తెలు వున్నారు. చిన్న కుమార్తె శ్రీపూజ తండ్రికి తలకొరివి పెట్టింది. మిగిలిన ఇద్దరు కుమార్తెలు కూడా అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

రీ సర్వేలో అన్యాయంపై విచారణ జరపాలి

▸▸ రామన్నదొరపాలెంలో ఆదివాసీలు ధర్నా


రామన్నదొరపాలెంలో ధర్నా చేస్తున్న ఆదివాసీ మహిళలు

రావికమతం, మార్చి 13 : తమకు జరిగిన అన్యాయంపై దర్యాప్తు జరపాలని ఎస్టీ కమిషన్ ఆదేశాలు జారీ చేసినా జిల్లా కలెక్టర్ పట్టించుకో లేదని ఆరోపిస్తూ బుధవారం రామన్నదొరపాలెం ఆదివాసీలు సీపీఎం ఆధ్వర్యంలో గ్రామంలో ధర్నా నిర్వహించారు. కొట్నాబిల్లి పంచాయతీ శివారు రామన్నదొరపాలెంలోని 12 మంది ఆదివాసీలకు కొట్నాబిల్లి రెవెన్యూలో ల్యాండ్ సీలింగ్ భూమికి 1975లో అప్పటి ప్రభుత్వం పట్టా లిచ్చింది. 1988లో అదే గ్రామానికి చెందిన మరో 30 మంది ఆదివాసీలకు డి.పట్టాలిచ్చారు. సదరు భూముల్లో నాటి నుంచి ఇప్పటి వరకూ ఈ ఆదివాసీలే పంటలు సాగు చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న ఈ ఆదివాసీల పేర్లను జగనన్న భూ రీ సర్వే అనంతరం రెవెన్యూ రికార్డుల్లో లేకుండా పూర్తిగా తొలగించారని ఆరోపించారు. దీనిపై వివిధ రూపాల్లో పోరాటాల అనంతరం గత ఫిబ్రవరిలో గొలుగొండ మండలం వచ్చిన ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరావును కలిసి సదరు గిరిజనులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. తమకు న్యాయం చేయాలని కమిషనర్ ఆదేశించినా కలెక్టర్ పట్టించుకోలేదని వారంతా ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, నందేల దేవుడు, రాయి రాజులమ్మ, జి.దేముడు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : ఎంపీడీవో


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం, మార్చి 13 : ప్రజల నుంచి వచ్చే అర్జీలను సచివాలయ సిబ్బంది సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీవో జె.రాంబాబు ఆదేశించారు. గన్నవరం సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి, సిబ్బందితో సమావేశమయ్యారు. పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సర్పంచ్ బొడ్డు సత్యనారాయణ, ఉప సర్పంచ్ లగుడు నాగబాబు, గన్నవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గొర్లి వరహాలబాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణానికి ఎమ్మెల్యే రిబ్బన్ కట్టింగ్!

... 5వ పేజీ తరువాయి

పట్టా కాని, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ గాని లేవు. అయితే ఏదో ఒక అధికారిక పత్రం ఉండాలన్న ఉద్దేశంతో 2022 అక్టోబరు 10 తేదీన తహసీల్దార్ నుంచి ఎండార్స్‌మెంట్ తీసుకున్నారు. అయితే క్లబ్ నిర్వాహకులు తొలుత ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారుల అండతో రెండు అంతస్థులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ భవనానికి ఆనుకొని 11 దుకాణాలతో మరో షాపింగ్ కాంప్లెక్స్ కట్టారు. నిబంధనల ప్రకారం గ్రామకంఠం స్థలాన్ని క్లబ్ అవసరాలకు వినియోగించుకోవాలే తప్ప, వాణిజ్య పరమైన వాటికి వినియోగించకూడదు. అయితే ప్రజాప్రతినిధులు, మునిసిపల్ అధికారుల అండదండలు వుండడంతో దుకాణ సముదాయాలు నిర్మించారు. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం ఈ స్థలం విలువ రూ.40-50 కోట్లు ఉంటుంది. పోనీ క్లబ్ తరఫున ప్రజలకు సేవా కార్యక్రమాలు ఏమైనా నిర్వహిస్తారా! అంటే అదీ లేదు. టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వయంగా ప్రజాప్రతినిధులే ప్రారంభిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని పట్టణ పౌరులు ఆరోపిస్తున్నారు. పైగా షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే గణేశ్.. 'సిటీ క్లబ్ నిర్వాహకులు షాపులు కట్టి పది మందికి ఉపాధి చూపిస్తున్నారు' అని చెప్పడం మరింత విడ్డూరంగా వుందని జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

ఫ్లైయాష్ రవాణాతో తంటాలు

... 5వ పేజీ తరువాయి

వాపోయారు. తమ ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోరా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లైయాష్ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. కాగా పైడివాడ అగ్రహారంలో ఫ్లైయాష్ వాహనాలను స్థానికులు అడ్డుకున్నట్టు తెలుసుకున్న ఎస్ఐ ధనుంజయ్, సిబ్బందితో అక్కడకు వెళ్లారు. ఆందోళనకారులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. రోడ్డు నిర్మాణ కంపెనీ ప్రతినిధులు, ఫ్లైయాష్ రవాణా చేసే వాహనాల యజమానులతో పైడివాడ అగ్రహారంలో సమావేశం ఏర్పాటు చేయిస్తానని, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్ఐ హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించి ఫ్లైయాస్ లారీలను విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, అక్కిరెడ్డి దుర్గినాయుడు, గొంతిన పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ టెన్షన్!

... 5వ పేజీ తరువాయి

పేరు మలి విడత జాబితాలో ఉంటుందా?, లేదా?...అన్నది మరికొన్ని గంటల్లోనే తెలుస్తుంది. మాడుగుల టికెట్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు ఆశిస్తున్నారు. వీరిలో ఒకరికి టికెట్ ఇవ్వాలా? లేకపోతే పొత్తులో భాగంగా పెందుర్తి స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో గత ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల టికెట్ ఇవ్వాలా? అనే దానిపై అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇక పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన పెందుర్తి నుంచి పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ పోటీ చేయడం దాదాపు ఖాయమైనట్టు సమాచారం.

వైసీపీ నుంచి టీడీపీలో భారీగా చేరికలు

▸▸ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించిన చింతకాయల విజయ్


టీడీపీలో చేరిన వారితో చింతకాయల విజయ్

గొలుగొండ, మార్చి 13 : ఆంధ్రప్రదేశ్‌కు పూర్వవైభవం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గొలుగొండలో బుధవారం రాత్రి ఎన్నికల శంఖారావం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు నలభై మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరందరికీ ఆయన కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. ఏ గ్రామం చూసినా సమస్యలే కనిపిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే గణేశ్ గొలుగొండ అభివృద్ధికి ఎన్ని నిధులు వెచ్చించారో చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అయ్యన్నపాత్రుడు మంత్రిగా నియోజకవర్గం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఒక్క గొలుగొండ పంచాయతీకే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల విజయమే అందరి లక్ష్యం కావాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజలంతా అయ్యన్నపాత్రుడికి పట్టం కట్టాలని కోరారు. అంతకుముందు గొలుగొండ, పేటమాలపల్లి, దళిత కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు చిటికెల సాంబమూర్తి, కొల్లాన కొండలరావు, సుర్ల బాబ్జి, అదపురెడ్డి గోపి, పారేపల్లి నాగేశ్వరరావు, పుల్లేటికుర్తి రమేష్, జనసేన మండల అధ్యక్షుడు గండెం దొరబాబు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు, సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

▸▸ ఎన్నికలు సజావుగా నిర్వహణకు అప్రమత్తంగా ఉండండి

▸▸ శిక్షణ శిబిరంలో జిల్లా నోడల్ ఆఫీసర్ శచీదేవి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారిణి శచీదేవి

నర్సీపట్నం అర్బన్, మార్చి 13 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వో, సూపర్‌వైజర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా నోడల్ ఆఫీసర్ కె.శచీదేవి తెలిపారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. అప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని వివరించారు. వెంటనే ఆయా ప్రాంతాల్లో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటర్ హెల్ప్‌లైన్, ట్విట్టర్ హ్యాండిల్స్, యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కె.శ్రీరాములు, ఎంపీడీవో జాన్ లింకన్, మునిసిపల్ కమిషనర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఆందోళన


పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

కృష్ణాదేవిపేట, మార్చి 13 : రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు జర్రా నాగమణి, వంతల ప్రశాంతికుమారి తదితరులు బుధవారం ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కాంట్రాక్టు ప్రాతిపదికన చేస్తున్నవారిని రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు వరలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన


ట్యాంకు నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట, మార్చి 13 : మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో అదనపు రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులకు విప్ కరణం ధర్మశ్రీ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ రక్షిత మంచి నీటిని అందించడమే లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ సుంకర శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరావు, శనివాడ అప్పారావు, ఆది సత్తిబాబు, పి.మాణిక్యం, సుంకర గాంధీ, ఆది ప్రకాష్, పి.రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పాత చెరువు అభివృద్ధికి నిధులు'

చోడవరం, మార్చి 13 : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల పాత చెరువు అభివృద్ధితో పాటు చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి వీఎంఆర్‌డీ నిధుల నుంచి రూ.43 లక్షలు మంజూరైనట్టు విప్ ధర్మశ్రీ బుధవారం తెలిపారు. ఇదిలావుంటే, గోవాడ, బెన్నవోలు పంచాయతీల్లో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మూడు గ్రామాల్లో తాగునీటి పథకాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. డీసీఎంఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పల్లా నరసింగరావు, ఏడువాక సత్యారావు, డీవీఆర్, వెంకన్నపాలెం సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, నాయకులు మూడెడ్ల శంకరరావు, బొడ్డేడ సూర్యనారాయణ, చందు రాంబాబు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

బుచ్చెయ్యపేట, మార్చి 13 : విజయరామరాజుపేట జడ్పీ హైస్కూల్ పదో తరగతికి చెందిన 62 మంది విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ మండల కార్యదర్శి దొడ్డి కిశోర్ గురువారం పరీక్ష కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా మంచి ఫలితాలు సాధించాల్సిందిగా ఆకాంక్షించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులతో పాటు వేగి మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

మాడుగుల రూరల్, మార్చి 13 : వీరవిల్లి అగ్రహారం ఎంపీయూపీ స్కూల్‌లో బుధవారం అగ్నిప్రమాదాల సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటైంది. మాడుగుల ఫైర్ ఆఫీసర్ రాజేశ్వరరావు, సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం సీడీసీ చైర్మన్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు


చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

చోడవరం, మార్చి 13 : చోడవరం చెరకు అభివృద్ధి మండలి (సీడీసీ) చైర్మన్‌గా సుంకర శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన ఇతనిని సీడీసీ చైర్మన్‌గా నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బుధవారం ఉదయం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చెరకు రైతుల సంక్షేమానికి పాటుపడతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ కేన్ కమిషనర్ లోకేశ్వర్, గోవాడ షుగర్స్ ఎండీ వి.సన్యాసినాయుడు, మాడుగులకు చెందిన అధికార పార్టీ నాయకులు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గొల్లవిల్లి సంజీవి, రాఖీ శ్రీను, స్థానిక నాయకులు సాగర్, గుమ్మడి శ్రీను తదితరులు పాల్గొన్నారు. .

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ


రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

దేవరాపల్లి/చీడికాడ, మార్చి 13 : మండలంలోని కాశీపురంలో 62 మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ పక్కా గృహం ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భాస్కరరావు, బూరే బాబూరావు, కేవీ రమణ, మంగునాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, చీడికాడ మండలం దిబ్బపాలెం నుంచి దండిసురవరం, కట్టువాని అగ్రహారం రోడ్డు జంక్షన్ వరకూ తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు బూడి ఒక ప్రకటనలో తెలిపారు.

బిల్లుల కోసం జగనన్న ఇళ్ల లబ్ధిదారులు గోడు


గాంధీగ్రామంలో గోడు వెళ్లబోసుకుంటున్న లబ్ధిదారులు

చోడవరం, మార్చి 13 : జగనన్న కాలనీ ఇళ్లు నిర్మించుకుని బిల్లుల కోసం నెలల తరబడి కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని మండలంలోని గాంధీగ్రామానికి చెందిన పలువురు ఇళ్ల లబ్ధిదారులు వాపోయారు. బుధవారం ఉదయం గ్రామ సచివాలయానికి వచ్చి వారు విలేకరులతో మాట్లాడుతూ తమ ఇంటి పనుల వివరాలను అప్‌లోడ్ చేయాలని రెండు నెలల నుంచి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఈశ్వరిసాయి చుట్టూ తిరుగుతున్నామన్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోతోందని వాపోయారు. సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేయకపోతే బిల్లులు రావడం కష్టమని వాపోయారు. కాగా ఈ వ్యవహారంపై స్థానిక పంచాయతీ సర్పంచ్ గాడి అప్పారావు, వార్డు సభ్యులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ అనుమతి లేకుండానే విధులకు గైర్హాజరైందని, అందువల్లే సచివాలయంలో ఇతర ఉద్యోగులకు కూడా వేతనాలు అందలేదని తెలిపారు. ఎన్నికలు వస్తే బిల్లులు పడవని తెలిసినప్పటికీ ఆమె విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అడవిరాజుల బాబు విగ్రహాలు ధ్వంసం

▸▸ పట్టణ పోలీసులకు ఫిర్యాదు ▸▸ సీఐ విచారణ


ధ్వంసమైన అడివి రాజులబాబు విగ్రహాలు

నర్సీపట్నం, మార్చి 13 : ఇక్కడి శివపురం అంజనేయ ఆలయం వెనుక గల తలుపులమ్మ గుడి సమీపంలో అడవి రాజులబాబు విగ్రహాలు ధ్వంసం చేసిన ఘటనపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడవిరాజుల బాబు పండగ సందర్భంగా స్థానికులు సిమెంటు దిమ్మ నిర్మించి, విగ్రహాలు పెట్టి పూజలు చేశారు. బుధవారం తమ స్థలంలో ఎందుకు పెట్టారని ఒక వ్యక్తి విగ్రహాలను నెట్టేశాడు. దీంతో ఆ విగ్రహాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై శ్రీను, సతీష్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కాంతి కుమార్ సదరు స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. అనంతరం ఇరువర్గాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో విగ్రహాలు పెట్టామని తెలిపారు. పదిహేను రోజుల్లోగా విగ్రహాలు తయారు చేయించి యథావిధిగా పెట్టాలని విగ్రహాలు పడగొట్టిన వ్యక్తికి సీఐ సూచించారు. స్థలం సర్వే చేయించి జిరాయితీ స్థలమా, ప్రభుత్వ స్థలమా అనేది నిర్ధారించుకోవాలన్నారు. దీనికి ఇరువర్గాలు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది.

అంజనేయ ఆలయం ప్రారంభం

మాకవరపాలెం, మార్చి 13 : దాలింపేటలో ఆంజనేయస్వామి ఆలయం బుధవారం ప్రారంభమైంది. టీటీడీ నిధులు రూ.పది లక్షలు వెచ్చించి ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేశ్‌తో పాటు పలువురు నాయకులు, భక్తులు దర్శించుకున్నారు. అలాగే రాచపల్లిలో ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను జడ్పీటీసీ పెట్ల సత్యవేణి ప్రారంభించారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు వాసు, మాజీ సర్పంచ్‌లు పెట్ల భద్రాచలం,పెట్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

చోడవరం, మార్చి 13 : నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.2.4 కోట్లు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ తెలిపారు. ఒక్కో మండలానికి రూ.60 లక్షల చొప్పున ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ పనులను ప్రారంభిస్తున్నట్టు వివరించారు.

'బోడిదొర పెద్దకార్యానికి సాయం అందించాలి'

కృష్ణాదేవిపేట, మార్చి 13 : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సేనాని గంటందొర మనుమడు బోడిదొర పెద్ద కార్యానికి ప్రభుత్వం రూ.50 వేలు ఆర్థిక సాయం అందించాలని అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు పాడేరు కలెక్టర్ విజయసునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎంపీ, ఎమ్మెల్యేలకు లేఖలు పంపినట్టు తెలిపారు. ఈనెల ఎనిమిదో తేదీన బోడిదొర మరణిస్తే ప్రభుత్వం అధికార లాంఛనాలతో కార్యక్రమం నిర్వహిస్తుందని భావించామని పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీన కొయ్యూరు మండలం లంకవీధిలో గల వారి స్వగ్రామంలో బోడిదొర పెద్దకార్యం జరపాలని కుటుంబీకులు నిర్ణయించారని వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని భోజన, ఇతర ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఈ నిరుపేద కుంటుబానికి బాసటగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

16న రెల్లి కుల సంఘం బహిరంగ సభ

నాతవరం, మార్చి 13 : రాష్ట్రంలో రెల్లి సామాజికవర్గానికి చెందిన వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 16వ తేదీ శనివారం మండలంలోని తాండవసెంటరులో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు రెల్లి కుల సంఘం రాష్ట్ర నాయకుడు యర్రంశెట్టి పాపారావు తెలిపారు. బుధవారం సంఘం నాయకులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. రెల్లి కులస్థులు కోల్పోయిన హక్కుల సాధనకు, రిజర్వేషన్లపైన సభలో చర్చించనున్నామన్నారు. రెల్లికులస్థులంతా పెద్ద సంఖ్యలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. సంఘం మండల నాయకులు బంగారు అబ్బు, మాజీ ఎంపీటీసీ బంగారు సూరిబాబు, బంగారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో కేంద్ర బలగాలు ఫ్లాగ్‌మార్చ్

రావికమతం, మార్చి 13 : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర బలగాలు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రావికమతం, మేడివాడ, గుమ్మళ్ళపాడు, చినపాచిల, గొంప, గుడ్డిప, తట్టబంద తదితర గ్రామాలలో అంతా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో అంతా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రావికమతం ఎస్ఐ ధనుంజయనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి


మొల్లమాంబ విగ్రహం వద్ద సంఘ సభ్యుల నివాళి

మాడుగుల రూరల్, మార్చి 13 : సత్యవరంలో బుధవారం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ అప్పారావు, సంఘం సభ్యులు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు

బుచ్చెంపేట జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం

రోలుగుంట, మార్చి 13 : బుచ్చెంపేట జడ్పీహైస్కూల్ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలతో సందడి చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. తొలుత ఇక్కడ గ్రామ వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ, ఇతర పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన కళా వేది కను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.